సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం ౹ 3 ౹ సెప్టెంబర్ ౹ 2023



### గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 18 కోడెలు, 2 ఆవులను పెద్దనాగారం శివపార్వతీ గోశాలకు శనివారం అందజేశారు.



### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: వేతనాలు పెంచడాన్ని హర్షిస్తూ వీవోఏలు ఇల్లంతకుంటలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

గరిష్టం/కనిష్టం
34.0/26.0

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### భలే మంచి కుక్కల బేరం!



కుక్కలను కొనుగోలు చేసిన గంటయ్య

సిరిసిల్ల: మీరు చదివింది నిజమే.. ఇంట్లో పెంచుకునే పెంపుడు కుక్కలను రూ.లక్షల్లో పోసి కొనుగోలు చేయడం, ముద్దుగా పెంచుకోవడం మామూలు విషయమే. కానీ వీధుల్లో కనిపించే కుక్కలను బేరం చేయడం విడ్డూరంగా ఉంటుంది. కానీ అవి ఉత్త కుక్కలు కావు. షికారీ(వేటాడే) కుక్కలు. అందుకే బేరమాడి మరీ కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేటకు చెందిన గంగిరెద్దుల యువకుడు గంటయ్య, చందుర్తి మండలం రామారావుపల్లికి చెందిన రాజు వద్ద షికారీ కుక్క తల్లీపిల్లను రూ.8 వేలకు కొన్నాడు. కుక్క యజమాని రాజు రూ.12 వేలు చెప్పగా.. గంటయ్య రూ.5 వేలకు అడిగాడు. ఇలా.. ఓ గంటపాటు బేరమాడి.. ఆఖరికి రూ.8 వేలకు బేరం కుదిరింది. ఇలా మర్తనపేట వద్ద కొనుగోలు ఒప్పందం చేసుకుని షికారీ కుక్కను పిల్లతో సహా పట్టుకెళ్లాడు. ఈ కుక్క అడవిలో ఉడుములు, కుందేళ్లు, జింకలను పసిగట్టి వేటాడుతుంది. అందుకే ఆనందంగా వేటకుక్కను కొనుక్కున్నాడు గంటయ్య.

### బకాయిలు చెల్లించండి



ఎల్లారెడ్డిపేటలో ధర్నా చేస్తున్న పాడిరైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ 200 మంది పాడిరైతులు శనివారం ఎల్లారెడ్డిపేటలో ధర్నాకు దిగారు. వీరికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు సత్యంరెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ 56 నెలలుగా ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పాడిరైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానన్న హామీ ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. దానా సబ్సిడీ ఇవ్వాలని కోరారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రమాకాంత్ అక్కడికి చేరుకోగా కలెక్టర్ రావాలంటూ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ జయంత్‌కుమార్ చేరుకొని వినతిపత్రం తీసుకున్నారు. పాడిరైతుల సంఘం నాయకులు ముత్యాల రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్, మహిపాల్, నల్ల పద్మారెడ్డి, తోపుచెర్ల నారాయణ, మాచర్ల మహేందర్, బాలయ్య, నారాయణరెడ్డి, పొన్నాల దేవిరెడ్డి, కొప్పుల కరుణాకర్‌రెడ్డి, సందుపట్ల రవి పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన డీఆర్‌డీవో శ్రీనివాస్



డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్‌కు పూలమొక్క అందిస్తున్న జిల్లా అధికారులు

సిరిసిల్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా నక్క శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో శ్రీనివాస్ డీఆర్‌డీవోగా నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆఫీస్‌లో విధుల్లో చేరారు. జెడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్‌డీవో గౌతమ్‌రెడ్డి పూలమొక్క అందించారు. అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, ఆఫీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులు కష్టపడి చదవాలి



చందుర్తి ప్రభుత్వ కళాశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐఈవో

చందుర్తి/రుద్రంగి(వేములవాడ): విద్యార్థులు కష్టపడి చదివితేనే మెరుగైన ఫలితాలు వస్తాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈవో) సీహెచ్.మోహన్ తెలిపారు. చందుర్తి, రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కాలేజీలను శనివారం తనిఖీ చేశారు. కళాశాల రికార్డులతోపాటు అధ్యాపకులు, విద్యార్థుల హాజరుపట్టికలు పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులు, అధ్యాపకుల సమష్టి కృషి అవసరమన్నారు. చందుర్తి కళాశాలను జిల్లాలో ప్రథమస్థానంలో నిలబెట్టాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్స్ మల్లేశ్, పులి గంగయ్య, అధ్యాపకులు వాణి, రాజిరెడ్డి, సుమన్, కృష్ణ, నీరజ ఉన్నారు.

# జ్వరాల పంజా

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- జిల్లా ఆస్పత్రికి పోటెత్తుతున్న రోగులు
- నిత్యం 600 మందికి పైగా అవుట్‌పేషెంట్లు
- ప్లేట్‌లెట్స్ తగ్గడంతో బెంబేలు



జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

‘సిరిసిల్ల పట్టణానికి చెందిన డిగ్రీ విద్యార్థిని రెండో రోజుల క్రితం ఎప్పటిలాగే కాలేజీకి వెళ్లింది. ఉన్నట్టుండి కడుపులో నొప్పి, వెన్నులోంచి వణుకుతో జ్వరం వచ్చింది. వెంటనే కళాశాల సిబ్బంది ఇంట్లో వారికి కబురుచేసి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాధారణ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.’

‘ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన ఎర్రం రాజయ్య జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న వైద్యుని సలహాతో మందులు వాడినా జ్వరం తగ్గలేదు. జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా ల్యాబ్ పరీక్షలు చేసి వైరల్ ఫీవర్‌గా తేలింది. మెరుగైన చికిత్స కోసం రెండు రోజులుగా సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.’

సిరిసిల్లటౌన్: జిల్లాలో జ్వరాలు పంజా విసిరాయి. పెరిగిన దోమలు.. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక టైఫాయిడ్, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో నిత్యం 600 మంది వరకు ఔట్‌పేషెంట్లు(ఓపీ) వస్తుండడం పరిస్థితికి అద్దం పడుతుంది. జ్వరాలతోపాటు వాంతులు, విరోచనాలతో ఆస్పత్రిలో చేరుతున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

**వారం రోజులుగా పెరిగిన బాధితులు**

జిల్లాలో గత వారం రోజులుగా జ్వర బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. వారం రోజులుగా తీవ్ర ఎండలు కొడుతుండడం.. పట్టణం.. పల్లె అనే తేడా లేకుండా దోమలు పెరిగిపోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులతోనే విరోచనాలు, మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సిరిసిల్లలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి రోజుకు సుమారు 600 వరకు రోగులు ఓపీ సేవల కోసం వస్తున్నారు. తినే తిండి, తాగే నీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లాలని సూచిస్తున్నారు.

### జిల్లా ఆసుపత్రికి పోటెత్తుతున్న రోగులు



జిల్లాసుపత్రికి పోటెత్తిన రోగులు

జిల్లా ఆస్పత్రికి గత వారం రోజుల్లోనే 2,969 మంది ఓపీ పేషెంట్లు రాగా... అందులో 400 వరకు ఓపీ, ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందారు. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఓపీ, ఇన్‌పేషెంట్ల సంఖ్య సాధారణం కంటే రెండింతలు ఎక్కువగా ఉంటోంది. గ్రామాల్లోని స్థానిక వైద్యులు చికిత్సను పొందిన వారు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి వస్తున్నారు.



| వారం | ఔట్ పేషెంట్లు | జ్వర బాధితులు |
|---|---|---|
| సోమవారం | 604 | 76 |
| మంగళవారం | 574 | 76 |
| బుధవారం | 488 | 86 |
| గురువారం | 135 | 18 |
| శుక్రవారం | 605 | 83 |
| శనివారం | 563 | 56 |
| మొత్తం | 2,969 | 395 |

### రెండు రోజులుగా జ్వరం



నేను తొమ్మిదో తరగతి చదువుతున్న. రెండు రోజులుగా జ్వరం, ఒళ్లంత నొప్పులు, వీక్‌నెస్‌గా ఉంటుంది. జిల్లా ఆస్పత్రికొస్తే వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరం వచ్చినట్లు చెబుతున్నారు. – షమీమ్

### వైరల్ ఫీవర్‌తో చేరాం



మాది ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్. ఐదు రోజుల క్రితం కడుపునొప్పి, జ్వరం వచ్చింది. జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి వైరల్ ఫీవర్ వచ్చిందని చెప్పారు. – ఎండీ షాహిద్

### ప్లేట్‌లెట్స్ తగ్గాయి



మాది కోరుట్ల వద్ద మల్లాపూర్. కోనరావుపేట మండలం మామిడిపల్లిలో బంధువుల ఇంటికి పది హేను రోజుల క్రితం వచ్చిన. దగ్గు, దమ్ముతో జ్వరం వచ్చింది. కరీంనగర్‌లో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా వైరల్ న్యూమోనియా అన్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే జిల్లా ఆసుపత్రిలో చేరిన. – కోరెం విజయ, మల్లాపూర్

### అర్హులతోనే వైద్యం చేయించుకోవాలి



ఆహారం కల్తీ కా కుండా చూసుకోవాలి. కాచి వ డబోసిన నీటిని తాగాలి. జ్వరం, ఇతర సీజనల్ వ్యాధులు వస్తే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్‌తోనే చికిత్స తీసుకోవాలి. జిల్లా ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులతోపాటు పూర్తిస్థాయిలో మందులు ఉన్నాయి. – డాక్టర్ మురళీధర్‌రావు, సూపరింటెండెంట్

# సేవలకు గుర్తింపు

- ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక
- బెస్ట్ హెచ్‌ఎంగా భాగ్యరేఖ
- శాఖాధిపతిగా శ్రీదేవి
- ఉత్తమ టీచర్‌గా కోత్వాల్ ప్రవీణ్
- 5న పురస్కారాలు అందజేత

సిరిసిల్లఎడ్యుకేషన్: విధుల్లో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు అవార్డులు వరించాయి. ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేస్తున్న ఉత్తమ గురువులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులు ప్రకటించింది. ఉత్తమ హెచ్‌ఎంగా సిరిసిల్లలో పనిచేస్తున్న భాగ్యరేఖ, బెస్ట్‌టీచర్‌గా రంగంపేటలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న కొత్వాల్ ప్రవీణ్, ఉత్తమ శాఖాధిపతిగా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న శ్రీదేవి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈనెల 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో పురస్కారాలు అందజేయనున్నారు.

### ఉత్తమ ఫలితాలతో భాగ్యరేఖ




భాగ్యరేఖ, హెచ్‌ఎం

సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విద్యార్థులలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేశారు. తాను చదువుకున్న పాఠశాలకే హెచ్‌ఎంగా రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె చెబుతున్నారు. సిరిసిల్లకు చెందిన నాగుల భాగ్యరేఖ పదోతరగతి పాసైన తర్వాత వివాహమైంది. తర్వాత డిస్టెన్స్‌లో ఇంటర్, డిగ్రీ, బీఈడీ చదివిన తర్వాత ఒకేసారి మూడు ప్రభుత్వ కొలువులు సాధించారు. సిరిసిల్లలోని బాలికల స్కూల్‌లోనే 1983లో పదోతరగతి పాసైన భాగ్యరేఖ తర్వాత అదే ప్రాంతానికి చెందిన రాఘవేందర్‌తో వివాహమైంది. పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూనే డిస్టెన్స్‌లో ఇంటర్ చదివారు. 1994 సింగిల్ సిట్టింగ్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించారు. 1996లో హైదరాబాద్‌లోని ఆంధ్ర మహిళా కళాశాలలో బీఈడీ చదివి.. 1998లో డీఎస్సీ పరీక్షల్లో ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ గంభీరావుపేటలో విధుల్లో చేరారు. ఎంచుకున్న రంగంలో నిబద్ధతతో పనిచేయడంతో 2012లో హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. 2018లో సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంగా వచ్చారు. ఆ సమయంలో ఆ స్కూల్‌లో 573 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగేళ్లలో భాగ్యరేఖ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలతో క్రమంగా విద్యార్థుల సంఖ్య 980కి చేరింది. విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించడంలో హెచ్‌ఎంగా భాగ్యరేఖ ముందుంటున్నారు. 2020–21 విద్యాసంవత్సంలో, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లా స్థాయిలో రెండు అవార్డులు అందుకున్నారు. ఈ సంవత్సరంలో ప్రభుత్వం బెస్ట్ హెచ్‌ఎంగా ఎంపిక చేసింది. పరిస్థితులను చూసి పరేషాన్ కావద్దని, ధైర్యంతో ముందుకెళ్లాలని ఆమె సూచిస్తున్నారు. ఈ అవార్డు బాధ్యతను పెంచిందని ‘సాక్షి’కి తెలిపారు.

### గణిత బోధనలో ‘ప్రవీణు’డు

- అటవీప్రాంత విద్యార్థులకు లెక్కల ట్రిక్కులు



కొత్వాల్ ప్రవీణ్

సిరిసిల్లఎడ్యుకేషన్/వీర్నపల్లి: అటవీప్రాంతంలోని విద్యార్థులను లెక్కల్లో ప్రావీణ్యులను చేసేందుకు ఉపాధ్యాయుడు కొత్వాల్ ప్రవీణ్ నూతనంగా ప్రయత్నిస్తున్నారు. టీచింగ్ లర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) ఉపయోగించి విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నారు. ప్రాథమిక విద్యార్థులకు అవసరమైన మెళకువలను అందిస్తున్నారు. కొత్వాల్ ప్రవీణ్ 2006 డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఫస్ట్ పోస్టింగ్ ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో చేరారు. అక్కడి నుంచి కోనరావుపేట మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వీర్నపల్లి మండలం రంగంపేటలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. మారుమూల ప్రాంతంలోని విద్యార్థులు గణితంలో పట్టు సాధించేలా వినూత్నంగా బోధిస్తున్నారు. టీఎల్‌ఎం తయారీలో సిద్ధహస్తుడైన ప్రవీణ్ ఇప్పటికే జిల్లా స్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. 2019–20లో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో జిల్లాస్థాయి అవార్డు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఐడియల్ టీచర్ అవార్డు ప్రోగ్రాంలో రాష్ట్రస్థాయి అవార్డు, భారతి ఫౌండేషన్ నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో జిల్లాస్థాయిలో వరుసగా రెండేళ్ల ద్వితీయ, ప్రథమ స్థాయిలో నిలిచారు. ప్రస్తుతం రంగంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

### ఉత్తమశాఖాధిపతిగా శ్రీదేవి



శ్రీదేవి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఎలక్ట్రికల్ శాఖాధిపతి పి.శ్రీదేవి రాష్ట్రస్థాయి ఉత్తమశాఖాపతి అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. ఈనెల 5న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందించనున్నట్లు చెప్పారు. 28 ఏళ్లుగా సాంకేతిక విద్యాశాఖ లో సేవలందిస్తున్న శ్రీదేవి కృషిని గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ శాఖాధిపతిగా అవార్డును ప్రకటించింది.

# ముంపుగ్రామాల సమస్యలు పరిష్కరిస్తాం

- ప్రభుత్వ పథకాల అమలులో ముంపు గ్రామాలకే ప్రాధాన్యం
- అనుపురంలోని మిడ్‌మానేరులో 28.50 లక్షల చేపపిల్లలు
- పేదల సొంతింటి కల నెరవేరుస్తాం
- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు



మిడ్ మానేరులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

వేములవాడ/వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. అనుపురం పాత గ్రామంలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్ నీటిలో 28.50 లక్షల చేపపిల్లలను శనివారం వదిలిన సందర్భంగా మాట్లాడారు. ముంపు గ్రామాల్లో మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి మరో రూ.40కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. చేపల ప్రాసెసింగ్ ద్వారా రాష్ట్ర, దేశవ్యాప్తంగా మార్కెట్ చేయడానికి విజయడెయిరీ మాదిరిగా విజయ ఫిషరీస్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచ్ వెంకటరమణారావు ఉన్నారు.

**వేములవాడ ఏరియా ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు**

వేములవాడ ఏరియా ఆస్పత్రికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. హాస్పిటల్‌లో ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. అర్బన్‌హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.1.43 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. మోకాలు కీలు మార్పిడి శస్త్రచికిత్సలు చేసుకున్న వారి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీలు మ్యాకల రవి, నాగం భూమయ్య, ఎంపీపీలు గంగం స్వరూపరాణి, బూర వజ్రమ్మ, కౌన్సిలర్ నీలం కల్యాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు ఉన్నారు.

**సొంతింటి కల నిజం చేయబోతున్నాం**

నిరుపేదల సొంతింటి కల నిజం చేస్తున్నామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. నియోజకవర్గంలోని ఎంపీడీవోలతో సమావేశమై గృహలక్ష్మి దరఖాస్తులపై చర్చించారు. నిరుపేదలు, అద్దె ఇళ్లల్లో ఉండే వారి పారదర్శకంగా ఎంపిక చేద్దామన్నారు. ఎంపీడీవోలు వెంకటేశ్, జనార్దన్, శంకర్, రవీందర్, రాంరెడ్డి, శ్రీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజల మనిషి వైఎస్సార్



సిరిసిల్లలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వేములవాడలో నివాళి అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్/వేములవాడ: వైఎస్ రాజశేఖరరెడ్డి సుపరిపాలన అందించి ప్రజల గుండెల్లో నిలిచారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సిరిసిల్ల, వేములవాడల్లో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ కౌన్సిలర్ వెల్ముల స్వరూప, జాలుగం ప్రవీణ్, వెంగల అశోక్, సూర దేవరాజు, మంగ కిరణ్, తాటికొండ శ్రీనివాస్, వేములవాడలో సాగారం వెంకటస్వామి, కనకయ్య, చిలుక రమేశ్, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, రాజు, కనికరపు రాకేశ్, బొజ్జ భారతి, మల్లయ్య, అంజయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, సాబీర్, రాము, నాగుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రజాకార్ల దాడికి సజీవ సాక్ష్యం పరకాల



నివాళి అర్పిస్తున్న ఉమ తదితరులు

చందుర్తి (వేములవాడ): రజాకార్ల దాడికి సజీవ సాక్ష్యంగా పరకాల గ్రామం నిలిచిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం నివాళి అర్పించి మాట్లాడారు. స్వేచ్ఛ, స్వాతంత్య్రం కోసం జరిగిన పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 1947 సెప్టెంబర్ 2న జాతీయ పతాకాన్ని ఎగురవేయాలనే కాంక్షతో హాజరైన ప్రజలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, చందుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు కడారి నరేశ్, కట్కూరి ముఖేశ్, రవి, చంద్రకళ, మమత, స్వప్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



ఎల్లారెడ్డి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన మాజీ సర్పంచ్ గుల్లపల్లి ఎల్లారెడ్డి(78) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఎల్లారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో వైద్యం అందించినా ఫలితం లేకుండా పోయింది. కొద్ది రోజులుగా ఎల్లారెడ్డిపేటలోని తన స్వగృహంలోనే ఉంటున్నాడు. దుమాల గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. ఎల్లారెడ్డి మృతదేహం వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు నివాళి అర్పించారు.

### బహ్రెయిన్‌లో కోరుట్లపేట యువకుడి దుర్మరణం



సుమన్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బహ్రెయిన్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేటకు చెందిన యువకుడు మేకనపల్లి సుమన్(26) మృతిచెందాడు. సుమన్ ఐదేళ్లుగా బహ్రెయిన్‌లోని కేరళకు చెందిన కంపెనీలో పనిచేస్తున్నాడు. ఓనమ్ పండుగను పురస్కరించుకొని కంపెనీ ఏర్పాటు చేసిన విందుకు సుమన్‌తోపాటు కేరళకు చెందిన మరో నలుగురు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయాన్ని సుమన్ తల్లిదండ్రులు నర్సయ్య, నర్సవ్వలకు శనివారం తెలిసింది. కోరుట్లపేట ఎంపీటీసీ మధు స్పందించి.. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఆశలు ‘సమాధి’

- కూతుళ్ల వివాహ సన్నాహాల్లో తల్లిదండ్రులు
- పెళ్లి సంబంధాలు చూస్తుండగానే దుర్ఘటన
- హత్యకు గురై అనంత లోకాలకు పెద్దకూతురు
- హంతకురాలిగా మారి కటకటాల పాలైన చిన్నకూతురు
- విషాదంలో శ్రీనివాసరెడ్డి – మాధవి దంపతులు



శ్రీనివాస్‌రెడ్డి నివాసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

> వాళ్లకు ఇద్దరు కూతుళ్లు.. అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.. రెండు బంగారు వడ్డాణాలు.. రెండు జతల బంగారు గాజులు.. ఇద్దరికీ కమ్మలు, బుట్టాలు.. ఎవరినీ తక్కువగా చూడలేదు.. అంతేకాదు.. వివాహాలకు అవసరమైన ఆభరణాలూ సిద్ధం చేశారు.. పెళ్లి సంబంధాలు చూడడంలో నిమగ్నమయ్యారు.. అంతలోనే పెద్దకూతురు ప్రాణాలు కోల్పోవడం.. చిన్నకూతురు జైలుకు వెళ్లడం ఆ దంపతులకు తీరని వేదన మిగిల్చింది.. సొంత అక్కనే హత్యచేసిన చెల్లెలు అని పోలీసుల విచారణలో తేలడంతో వారి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి–మాధవి కన్నీరుమున్నీరవుతున్నారు.

కోరుట్ల: బంక శ్రీనివాస్‌రెడ్డి నెల్లూరు జిల్లా నుంచి సుమారు పాతికేళ్ల క్రితం ఉపాధి కోసం కోరుట్లకు వలస వచ్చారు. భార్య మాధవితో కలిసి చిన్నచితకా పనులు చేశారు. చివరకు ఇటుకబట్టీ వ్యాపారంలో స్థిరపడి మంచిపేరు తెచ్చుకున్నారు. ఈ దంపతులకు పెద్దకూతురు దీప్తి, చిన్నకూతురు చందన, కుమారుడు సాయి సంతానం. చిన్ననాటి నుంచి కూతుళ్లను అల్లారుముద్దుగా పెంచారు. ఇద్దరినీ బీటెక్ చదివించారు. నాలుగేళ్ల క్రితం దీప్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పుణేలోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. చందన ఇటీవల బీటెక్ పూర్తిచేసింది. కొడుకు సాయి బెంగళూర్‌లో డిగ్రీ చదువుతున్నాడు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం పాతికేళ్లుగా కష్టపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు.. పెళ్లీడు కొచ్చిన ఇద్దరు కూతుళ్లకు వివాహం చేయడానికి ఆర్నెల్లుగా మంచిసంబంధాలు చూస్తున్నారు.

**పెళ్లిళ్ల కోసం స్థలాలు విక్రయించి..**

- ఇటుకబట్టీ వ్యాపారంలో అంతోఇంతో సంపాదించిన శ్రీనివాస్‌రెడ్డి.. తాను కొనుగోలు చేసిన స్థలాలను ఇటీవల విక్రయించారు.
- ఇలా తన కూతుళ్లు దీప్తి, చందన వివాహాల కోసం డబ్బు, నగలు సమకూర్చుకున్నారు.
- సుమారు రూ.90 లక్షలు వెచ్చించి పెళ్లిళ్లకు అవసరమైన వడ్డాణాలు, చైన్‌లు, కమ్మలు, బుట్టాలు, హారాలు తయారు చేయించారు.
- వీటితోపాటు కొంత నగదు సిద్ధం చేసుకున్నారు.
- తన సొంతూరు నెల్లూరుకు వెళ్లి మంచి సంబంధాలు చూస్తున్నారు.
- కానీ, ఇంతలోనే దీప్తి హత్య ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది.

**విశ్రాంతి తీసుకునే సమయంలో విషాదం..**

కూతుళ్లకు వివాహం చేసి చరమాంకంలో విశ్రాంతి తీసుకుందామని యోచించిన శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు దీప్తి హత్య షాక్ ఇచ్చింది. పెద్దకూతురు హత్య కు గురికావడమే కాకుండా.. చంపింది చిన్న కూతు రు చందన కావడం నివ్వెరపరిచింది. అంతేకాదు.. పెళ్లిళ్ల కోసం తాను సమకూర్చిన నగలు, నగదు తీసుకుని చందన ప్రియుడితో పరారైన వైనం శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు అశనిపాతంగా మారింది. ప్రస్తుతం దీప్తి హత్యకు గురికావడం, అక్కను హత్యచేసి జైలుపాలు కావడంతో శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఇద్దరు కూతుళ్లు దూరం కావడంతో ఆ కుటుంబంలోనే కాదు.. పట్టణంలోనూ విషాదం నెలకొంది.

## ఓటరు నమోదుపై ప్రచారం చేయాలి



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- ఒక్కరు కూడా మిస్ కావొద్దు
- పొరపాటున తొలగిస్తే వెంటనే నమోదు చేయండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల/వేములవాడఅర్బన్: ఓటరు నమోదుపై పల్లెల్లో మైక్, చాటింపు ద్వారా ప్రచారం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ఎవరినైనా పొరపాటున తొలగిస్తే.. వెంటనే నమోదు చేయాలన్నారు. సెప్టెంబరు 19 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. ప్రతీ వెయ్యి మంది ఓటర్లలో సగటున 25 మంది కొత్త ఓటర్లు ఉండేలా చూడాలని కోరారు.

**సిరిసిల్లలో ఆర్డీవో తనిఖీలు**

సిరిసిల్లలో ఆర్డీవో ఎస్.ఆనంద్‌కుమార్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. బూత్‌లెవల్ అధికారుల వద్ద సమాచారం సేకరించారు. గీతానగర్ పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక నమోదును పరిశీలించారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట, చందుర్తిల్లో మహిళలు ‘మన ఓటు.. మన హక్కు’ అంటూ నినాదాలు రాసి రంగవల్లికలతో ప్రచారం చేశారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి**

సిరిసిల్ల: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కొత్తగా నమోదయ్యే యువ ఓటర్లకు ఓటరు గుర్తింపుకార్డులు అందించాలన్నారు. తప్పులు లేని జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఉండేలా బూత్ లెవల్ ఆఫీసర్లు శ్రద్ధ చూపాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో వచ్చే దరఖాస్తులను వారం రోజుల్లో పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా జనాభా, ఓటర్లు, లింగ నిష్పత్తి, యువ ఓటర్ల నమోదుపై దృష్టిసారించాలని కోరారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధి కారి సర్ఫ్‌రాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్‌లో మా ట్లాడా రు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో లు ఎస్. ఆనంద్‌కుమార్, మధుసూదన్, ప్రత్యేక డిప్యూ టీ కలెక్టర్ గంగయ్య, కలెక్టరేట్ పాలనాధికారి రాంరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పాష పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

- జిల్లా విద్యాధికారి రమేశ్



మాట్లాడుతున్న డీఈవో రమేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు మండలాల జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ‘ఉన్నతి’ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలన్నారు. కోవిడ్ నేపథ్యంలో రెండేళ్లు విద్యార్థులు చదువుకు దూరమయ్యారన్నారు. ప్రతి తరగతిలో విద్యార్థులను మూడు భాగాలుగా విభజించి, వారు చదువులో రాణించేలా పనిచేయాలన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చేపట్టిన ‘లక్ష్య’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంఈవో బన్నాజీ, కోర్సు డైరెక్టర్ విఠల్‌నాయక్, హెచ్‌ఎం రాజునాయక్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా మోసగాళ్లు అరెస్ట్

- ప్రైవేట్ సొసైటీ పేరుతో మోసాలు
- ఐదు బ్రాంచ్‌లలో 1,600 మంది దగ్గర రూ.3 కోట్ల వసూలు
- రియల్‌ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడులు
- రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, సీఐ కరుణాకర్



సొసైటీ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు, సెల్‌ఫోన్లు

వేములవాడ: ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన పోతరాజు లక్ష్మణ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ణ శ్రీధర్ 2000 సంవత్సరంలో మంచిర్యాల జిల్లాలో ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటీవ్ సొసైటీ కంపెనీని స్థాపించారు. ఆరు నెలల వ్యవధిలోనే బెల్లంపల్లి, లక్సెట్టిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సొసైటీలు స్థాపించారు. దాదాపు 1600 మంది వరకు ఖాతాలు తెరవడంతో రూ.3 కోట్ల వరకు సేకరించారు. శ్రీధర్ చైర్మన్‌గా, తన పూర్వ విద్యార్థి పోతరాజుల లక్ష్మణ్‌ను సీఈవోగా నియమించుకొని మరికొంత మంది సిబ్బందిని తీసుకున్నారు. ప్రజల నుంచి రికరింగ్ డిపాజిట్స్ ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులను శ్రీధర్, లక్ష్మణ్ కలిసి మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, లిక్కర్, చిట్ ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 150 మందికిపైగా సభ్యత్వం కల్పించి, సొసైటీలో ఖాతా తెరిచేందుకు రూ.650 వసూలు చేశారు. తమ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ కాలంలోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. గత నెల 22న వేములవాడకు చెందిన బుస్స శ్రీనివాస్ మరికొందరు బాధితులు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 1న వ్యాపారం కోసం శ్రీధర్, లక్ష్మణ్‌లు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడ టౌన్ పోలీసులు నందికమాన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కారు, సొసైటీకి సంబంధించిన కరపత్రాలు, పాస్‌బుక్స్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఫామ్స్, లావాదేవీలకు సంబంధించిన రిజిష్టర్స్, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కంపెనీలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడవద్దని, ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, పోలీసులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేసింది వైఎస్సారే

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతున్న మల్యాల, రామన్నపేట గ్రామాల రైతులు

వేములవాడ: రైతును రాజు చేయాలన్న సంకల్పంతో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతు పక్షపాతిగా పేరు సంపాదించుకున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. తిప్పని నర్సయ్య ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో ఆది శ్రీనివాస్‌కు మద్దతు తెలియజేస్తామని 100 మంది చందుర్తి మండలం మల్యాల, రామన్నపేట గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతును రాజు చేయాలని సంకల్పంతో ఉచిత విద్యుత్ ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కూడా తమ మీద పడలేదని, ప్రస్తుతం 40 కిలోలకు నాలుగు కిలోలు దోపిడీ జరుగుతుందని వాపోయారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మల్యాల గ్రామానికి వచ్చారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ రావాలన్నారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. 24 గంటల కరెంటు యథాతథంగా కొనసాగిస్తామని వివరించారు.

# సిరిసిల్లలో మిన్నంటిన నిరసనలు

- కలెక్టరేట్ ఎదుట భగీరథ కార్మికుల ధర్నా
- కొనసాగిన రెండో ఏఎన్‌ఎం, ఎన్‌హెచ్‌ఎంల దీక్షలు



దీక్షలో రెండో ఏఎన్‌ఎంలు



అంబేద్కర్ చౌక్‌లో ఎన్‌హెచ్‌ఎంల దీక్ష

సిరిసిల్లటౌన్: ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం నిరసనలు, ధర్నాలతో హోరెత్తించారు. మిషన్ భగీరథ కార్మికులకు నేరుగా ప్రభుత్వమే జీతాలు అందించాలని కోరారు. చాలా రోజులుగా తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం పనులు పూర్తి, విజయవంతం చేయడంలో కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, విధి నిర్వహణకు పెట్రోల్ అలవెన్సులు కల్పించి, టార్చ్‌లైట్లు అందించాలన్నారు. సేఫ్టీ జర్కిన్‌లు, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లను వివరిస్తూ కలెకటరేట్‌లో వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జవేణు తదితరులున్నారు.

**ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి**

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ చౌరస్తాలో రిలే దీక్షలు కొనసాగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎహెచ్‌ఎం స్కీం వర్కర్లు రాణి, స్రవంతి, వాణి, బాలకృష్ణ, శేఖర్, సీత తదితరులు పాల్గొన్నారు.

**పదహారో రోజుకు దీక్షలు**

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రెండో ఏఎన్‌ఎంల రిలే దీక్షలు శనివారం పదహారో రోజుకు చేరాయి. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం సాగుతుందంటూ నిరసనలు హోరెత్తించారు. ఏపీ ప్రభుత్వం చేసినట్లుగా బేషరతుగా తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరోజ, కరుణశ్రీ, మధురిమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



చెక్కు అందిస్తున్న మేనేజర్ చందు

ముస్తాబాద్(సిరిసిల్ల): పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతీ వ్యక్తి జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా కుటుంబాలకు అండగా నిలవవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గూడెం శాఖ మేనేజర్ చందు అన్నారు. గూడెం టీజీబీలో జనరల్ ఇన్సూరెన్స్ చేసి చెట్టుపై నుంచి పడి మృతిచెందిన మందాడి ఆశయ్య కుటుంబానికి రూ.10లక్షల చెక్కును శనివారం అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు పీఎంజేజేబీవై ద్వారా రూ.436, పీఎంఎస్‌బీవై ద్వారా రూ.20 సంవత్సరానికి ఒకసారి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, క్యాషియర్లు పర్శరాములు, మనోజ్, నాయకులు కొమ్ము బాలయ్య, శ్రీనివాస్‌రావు, ఎల్లాగౌడ్, మల్లేశ్, పర్శరాములు, సంతోష్, అక్షయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ క్రీడా పాఠశాల హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల ప్రవేశాలకు ఇటీవల ఎంపికపోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లానుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగో తరగతికి ఎస్.చైతన్య (జగిత్యాల), పి.అలకనంద (జగిత్యాల), కె.అమూల్య, డి.శ్రీవర్షిణి (కరీంనగర్), ఏ.అనన్య (పెద్దపల్లి), బి.హర్షిత, ఈ.శ్రీనిజ(రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. ఐదో తరగతికి జి.శ్రీఖేష్, పి.సాహిత్ పటేల్ (జగిత్యాల), ఎస్.సిద్ధార్థ, జె.హరిహరణ్‌యాదవ్ (పెద్దపల్లి), బి.వినమ్రత్ సింహ(రాజన్న సిరిసిల్ల), ఆర్.కావ్యశ్రీ, ఎం.సాహితి, పి.సౌమిత, ఎ.సంస్కృతి (జగిత్యాల), ఏ.అక్షిత(కరీంనగర్), టి.అక్షిత, బి.సహస్ర (రాజన్న సిరిసిల్ల) ఎంపికయ్యారు. వీరు ఈ నెల 5న తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్‌లో ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని అధికారులు పేర్కొన్నారు.

## రైల్వే బాధితులకు అండగా ఉంటా



బాధితులతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: రైల్వే బాధితులకు అండగా ఉంటానని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ శివారులోని రైల్వేలైన్ బాధితులతో శనివారం మాట్లాడారు. ప్రభుత్వంతో మాట్లాడి తప్పకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ ఎ. సుధాకర్‌రావు మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు హింగె శ్రీనివాస్‌ను సైతం పరామర్శించారు. వచ్చే ఎన్నికల్లో సహకరించాలని పలువురు కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధుల ఇండ్లకు వెళ్లి కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా సంక్షేమ గురుకుల డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజనీ ప్రకటనలో తెలిపారు. బీకాం (సీఏ), బీఎస్సీ (లైఫ్‌సైన్స్), బీఎస్సీ(ఫిజికల్ సైన్స్), బీఏ, బీఏ(హానర్స్), ఇంటీరియర్ డిజైన్, బీఏ హానర్స్ ఫ్యాషన్ డిజైన్, బీఏ హానర్స్ ఫొటోగ్రఫీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 95020 82958, 97037 09376 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## మద్యం తాగి వాహనం నడపొద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రాజు

సిరిసిల్ల: మద్యం తాగి వాహనాన్ని నడపడం నేరమని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై రాజు అన్నారు. మద్యం తాగి బండి నడుపుతూ పట్టుబడిన వారికి సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలకు మద్యం తాగి బండి నడపడమే ఎక్కువగా కారణమవుతుందన్నారు. తాగి వాహనాన్ని నడుపడం మూలంగా ఎదుటివారి ప్రాణాలు పోతున్నాయని వివరించారు. ఎంత మోతాదులో మద్యం తాగినా వాహనం నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక్కసారి తప్పు చేస్తే.. క్షమిస్తామని, రెండోసారి ఇదే పరిస్థితి ఎదురైతే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు.ఈ సందర్భంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాల పత్రాలను పరిశీలించి వదిలేశారు.

## ‘నారాయణ’పై అవిశ్వాసానికి గ్రీన్‌సిగ్నల్

- రసవత్తరంగా సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు రాజకీయం
- 15న బల పరీక్షకు రంగం సిద్ధం
- ఉత్తర్వులు జారీ చేసిన డీసీవో

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలోని అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ అవిశ్వాస తీర్మానానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. చాలా రోజులుగా చైర్మన్ తీరుపై వైస్‌చైర్మన్ సహా తొమ్మిది మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి భీష్మించుకున్నారు . ఫలితంగా ఈనెల 22న నారాయణపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ డీసీవో బుద్ధనాయుడుకు తీర్మాన పత్రం అందించారు.

**15న అవిశ్వాస తీర్మానం**

సహకార చట్టం 1994 సెక్షన్ 34 సబ్ సెక్షన్ 2 ప్రకారం అర్బన్‌బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి బ్యాంకు ఉపాధ్యక్షుడు గడ్డం విఠల్‌తో పాటు 9 మంది డైరెక్టర్లు డీసీవోను కోరారు. ఈమేరకు ఆయన ఈనెల 15న ప్రవేశపెట్టడానికి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అవిశ్వాస తీర్మానంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు రాజకీయంగా దుమారం రేపుతోంది. పార్టీకి అతీతంగా సాగిన ఎన్నికలైనా, అధికార పార్టీకి చెందిన మెజార్టీ డైరెక్టర్లు పాలకవర్గంగా కొనసాగుతున్నారు. అయినా అధ్యక్షుడు నారాయణ ప్రవర్తన తీరుపై చాలా రోజులుగా పలువురు డైరెక్టర్లు విభేదిస్తున్నారు.

**అవిశ్వాసం.. వీగేనా.. నెగ్గేనా..?**

బ్యాంకులో 12 మంది డైరెక్టర్లున్నారు. మెజార్టీ సభ్యులు 9 మంది అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. అయితే గతేడాది కూడా అవిశ్వాస తీర్మానం కోసం మెజార్టీ డైరెక్టర్లు కోరారు. పార్టీ పెద్దల ప్రమేయంతో అవిశ్వాసం జరుగలేదు. ప్రస్తుతం ఉపాధ్యక్షుడు విఠల్, డైరెక్టర్లు మందాడి శ్రీనివాస్‌రెడ్డి, కోడం సంజీవ్, స్వర్గం రాజు, అడ్డగట్ల శారద, అడిచెర్ల సాయికృష్ణ, ఆడెపు అనసూర్య, నేరెళ్ల శ్రీకాంత్, వేముల రాములు సంతకాలతో అవిశ్వాస తీర్మానం కోరుతున్నారు. నారాయణ కాలపరిమితి నాలుగేళ్లు పూర్తవడం, ఇన్ని రోజులుగా డైరెక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బ్యాంకులో సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నందున తాము ఇబ్బందులు పడుతున్నామనేది వారి వాదన. అయితే నారాయణ సైతం తనపై వస్తున్న అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా శతవిధాలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పార్టీ పెద్ద ఒకరు ఈవిషయంలో కలుగజేసుకుని అవిశ్వాసం తీర్మానం కావాలనే డైరెక్టర్లతో మాట్లాడుతారన్న ప్రచారం సాగుతోంది. కాగా మరో 12 రోజుల్లో జరగనున్న అవిశ్వాసం వీగేనా.. నెగ్గేనా.. అన్న మీమాంస అన్ని వర్గాల్లో ఆసక్తిరేపింది.